క్లుప్తంగా

పెద్దింట్లమ్మకు రూ.2.20 లక్షల ఆదాయం



అమ్మవారి ఆలయంలో ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయ హుండీల ద్వారా అమ్మవారికి భక్తుల నుంచి మొత్తం రూ.2,20,184 ఆదాయం శనివారం సమకూరింది. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో మార్చి 28వ తేదీ నుంచి ఈ నెల 5వ తేదీ వరకూ 9 రోజులకు గాను హుండీలు తెరచి లెక్కించగా పై ఆదాయం సమకూరింది. ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో పై లెక్కింపు చేపట్టారు. కాగా ఆదాయం మొత్తంలో మెయిన్ హుండీల ద్వారా రూ.2,07,568, ఆలయంలోని కోట సత్తెమ్మ అమ్మవారి హుండీ ద్వారా రూ.12,616 ఆదాయం వచ్చినట్టు అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఉపసర్పంచ్ మెండు శ్రీను, ఉండపల్లి అంజిబాబు, పోలీసు, రెవెన్యూ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్



పేరవరంలో బెల్లపు ఊట పీపాలను కనుగొన్న ఎస్సై అన్నవరం, సిబ్బంది

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం మద్యం బాటిళ్లతో ఒక వ్యక్తి అరెస్టుతో పాటు బెల్లం ఊటను కనుగొని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. పలివెల గ్రామానికి చెందిన బయ్యే నాగరాజు వద్ద 180 ఎంఎల్ పరిమాణం గల 9 మద్యం బాటిళ్లతో అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఆత్రేయపురం మండలంలోని పేరవరం సమీప గోదావరి లంకలో సారా తయారీకి ఉపయోగించే మూల ద్రవం 1300 లీటర్ల బెల్లపుఊట నిల్వ ఉంచిన ప్లాస్టిక్ పీపాలను గుర్తించారు. వాటిని వెలికి తీసి, వాటిలో ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎస్సైలు కె.అన్నవరం, ఎం.రామచంద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సాయం పంపిణీ



పేదలకు సాయం చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

సఖినేటిపల్లి: రామేశ్వరం విలేజ్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యాన శనివారం గ్రామ పంచాయతీ వద్ద నిర్వాహకులు 100 మంది పేదలకు సాయం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.100 నగదు, 5 కేజీల బియ్యం చొప్పున అందజేశారు. కాగా దాతలు సాయంతో ప్రతి నెలా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ట్రస్టు ఫౌండర్ సరెళ్ల విజయ్ ప్రసాద్ తెలిపారు. ఈ నెలకు సేవా కార్యక్రమాలకు గాను ట్రస్టుకు విరాళంగా రూ.20 వేలు అందించిన మోకా మోహన్‌రావు, మోకా నవీన్ కిరణ్, స్థానిక ఎన్నారైలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు, ట్రస్టు మెంబర్స్ బళ్ల లక్ష్మణ్‌రావు, అల్లూరు మధురాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సత్కారం



భీమశంకరరావును సత్కరిస్తున్న చల్లా తదితరులు

ఆలమూరు: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కాండ్రేగుల భీమశంకరరావుకు ఘన సత్కారం జరిగింది. శ్రీకృష్ణ దేవరాయ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో నేతలు అధ్యక్షుడు భీమశంకరరావుకు దుశ్శాలువ కప్పి పూలమాలలు వేసి మెమెంటో బహూకరించి ఘనంగా సత్కరించారు. న్యాయవాద వృత్తికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కాపు సంఘ నేత ప్రభాకరరావు ఆకాంక్షించారు. బడుగు బలహీన, పేద, మధ్యతరగతి వర్గాలకు ఉచితంగా న్యాయసలహాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. చల్లా నానాజీ, శిరిగినీడి పట్టాభి, గంటా వీర్రాజు, సాకా సత్తిబాబు, సామంతీఉల నాని, చల్లా భూషణం, కొమ్మన రఘు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఈనెల ఏడో తారీఖు నుంచి ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్‌వీ సూర్యనారాయణ రెడ్డి శనివారం తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు అందరూ హాల్ టికెట్, ఆధార్ కార్డు తీసుకువచ్చి జాయిన్ అవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



మామిడికుదురులో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



మలికిపురంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



అంబాజీపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు



పెదపళ్లలో బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు



కొత్తపేటలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ గంగాధరరావు

గొప్ప సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్

- ఘనంగా జయంతి
- నివాళులర్పించిన నేతలు

మామిడికుదురు: మాజీ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ మంచి సంఘ సంస్కర్త అని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శ్లాఘించారు. జగ్జీవన్‌రామ్ జయంతిలో భాగంగా శనివారం మామిడికుదురు బస్టాండ్ కూడలిలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏప్రిల్ నెల బడుగు, బలహీన, పీడిత, తాడిత ప్రజానీకానికి పండుగ నెల అన్నారు. బీఆర్ అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ వంటి మహనీయులు పుట్టిన నెల అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

మలికిపురం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ విశేష కృషి చేశారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం బాబూ జగ్జీవన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సూర్యారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నేటి పాలకులకు జగ్జీవన్‌రామ్ ఆదర్శమన్నారు. ఆయన హయాంలో దేశం అభివృద్ధి పథంలో నడిచిందన్నారు. నాటి పాలకులు అందరికీ సమన్యాయం పాటించారన్నారు. కార్యక్రమంలో మండల శాఖల పార్టీ అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఈద రవిరెడ్డి, సూరిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: దేశ మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు నేటి తరం యువత కృషి చేయాలని జెడ్పీటీసీ, పి.గన్నవరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా అంబాజీపేట కముజువారిపేటలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, స్థానిక బస్టాండ్ వద్ద ఎంఆర్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పీకే రావు, మందపాటి కిరణ్‌కుమార్, దొమ్మేటి సత్యమోహన్, మైలా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌కు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని స్థానిక కాపు కల్యాణ మండపం వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఉప సర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల బ్రహ్మానందం, ఈఓపీఆర్డీ సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ కోటిపల్లి దామోదరం ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, ఆ పార్టీ నాయకులు కాపు కళ్యాణ మండపం వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు.



రావులపాలెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: గ్రామంలో ప్రియదర్శిని కాలనీలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతిలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శనివారం పాల్గొన్నారు. ఆయనకు కమిటీ సభ్యులు, యువకులు అందరూ కలసి స్వాగతం పలికారు. అనంతరం జగ్జీవన్ రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన నిత్యావసరాలను ప్రియదర్శిని కాలనీలో నివాసం ఉంటున్న 50 మంది వితంతువులకు, వృద్ధులకు జగ్గిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అలాగే అదే కాలనీలో నివసిస్తున్న గంటి శ్రీను ఇటీవల మరణించడంతో ఆయన కుమార్తెను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఊబలంకలో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలను మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శనివారం ఆవిష్కరించారు. సమాజానికి రెండు కళ్లుగా జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ ఉన్నారన్నారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ సభ్యులు నిర్వహించిన ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా డిపో మేనేజర్ రమణ పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేశారు.

ఆలమూరు: సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్ స్ఫూర్తిని నేటి పాలకులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము నారాయుడు, ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడెల్లి సురేష్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పలు సేవా సామాజిక కార్యక్రమాలు చేపట్టారు.

అయినవిల్లి: మండలంలోని విలసలో వైఎస్సార్ సీపీ నాయకుడు చేట్ల రామారావు ఇంటి వద్ద జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ వేడుకలో కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పి.గన్నవరం: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అక్విడెక్టు పార్కులో మండలపార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన జయంతిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి గన్నవరపు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

రాజోలు: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం రాజోలులో ఘనంగా నిర్వహించారు. స్థానిక తెన్నేటి నగర్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి తెన్నేటి కిషోర్, గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల జానకీరామ్, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీఈశ్వరి తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజోలు బార్ అసోసియేషన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి అధ్యక్షుడు యర్రంశెట్టి అయ్యప్పనాయుడు, ప్రధాన కార్యదర్శి చింతా ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పక్క జిల్లా నుంచి పది అడ్మిషన్లు



అనగర్లంకలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న హెచ్ఎం నిరంజని

మామిడికుదురు: విద్యాశాఖ చేపట్టిన ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ మంచి ఫలితాలను ఇస్తోంది. ప్రైవేటు కన్నా ఎక్కువగా సదుపాయాలు తమ స్కూల్‌లో ఉన్నాయని, అక్కడ కన్నా ఇక్కడ తాము మెరుగైన బోధన అందిస్తామంటూ మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు శనివారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం అనగర్లంక గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కోనసీమ జిల్లాను చేరి ఉండే ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు మామిడికుదురు బాలుర, బాలికల వసతి గృహాల్లో చేరి ఇక్కడి స్కూల్‌లో చదువుకుంటారు. ఈ నేపథ్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి పిల్లలను తమ స్కూల్‌లో చేర్పించాలంటూ ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్పెషల్ డ్రైవ్‌లో నిర్వహించారు. ఈ స్కూల్‌లో ఉన్న సదుపాయాలను పేరెంట్స్‌కు వివరించారు. 10 మంది పిల్లలకు ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పిస్తూ అడ్మిషన్లు ఇచ్చారు.

బీసీ సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆకుమర్తి భూషణం, నాయకులు

మలికిపురం: మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఈనెల 11న బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో అమలాపురం కలెక్టరేట్ వద్ద తలపెట్టిన బీసీ సమరభేరి పోస్టర్‌ను రాజోలు నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుమర్తి భూషణం శనివారం మలికిపురం పూలే-అంబేడ్కర్ భవనం వద్ద ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పూలే ఆలోచనలను అందుకున్నప్పుడే ఈ దేశ సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందన్నారు. బీసీల సమస్యలే ఈ దేశ సమస్యలని, విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన అన్నారు. తదనుగుణంగా సమగ్ర కులగణన జరపాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ బత్తుల లక్ష్మణరావు, రాష్ట్ర బీసీ సమైక్య సాధికార అధ్యక్షుడు గుబ్బల బాబ్జి, మలికిపురం మండల ఎస్సీ వెల్ఫేర్ అధ్యక్షులు గెడ్డం ఫిలిప్‌రాజు, నల్లి శివకుమార్, బూషి జాన్ మోషే, మోకా శ్రీనుబాబు, పటాన్ల సత్యనారాయణ, నల్లి రాజ్‌కుమార్, పెదపూడి రవి, తెన్నేటి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

నవమికి ఆలయాల ముస్తాబు

అంబాజీపేట: శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించేందుకు ఆలయాలను ముస్తాబు చేశారు. అంబాజీపేట, మాచవరం, గంగలకుర్రు, ముక్కామల, గంగలకుర్రు అగ్రహారం తదితర గ్రామాల్లో ఉన్న దేవాలయాలను నిర్వాహకులు సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలకరించారు. శ్రీరామనవమి వేడుకకు అధిక సంఖ్యలో హాజరయ్యే భక్తులకు వేసవి తాపం లేకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణాల వద్ద పోటాపోటీగా పానకాలను సిద్ధం చేస్తున్నారు. కొన్ని ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

ఘనంగా గురుకుల పాఠశాల వార్షికోత్సవం

పి.గన్నవరం: విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పి.గన్నవరం తహసీల్దార్ పి.శ్రీపల్లవి అన్నారు. మండలంలోని నరేంద్రపురం గురుకుల పాఠశాల వార్షికోత్సవం ప్రిన్సిపాల్ పున్నం వేణు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సికిలే ప్రభాకర్ అధ్యక్షతన సభలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ రకాల క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు మెమెంటోలు అందజేశారు. సర్పంచ్ బీర వెంగమాంబ, గురుకుల పాఠశాల గౌరవాధ్యక్షులు మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, ఎంపీటీసీ కొక్కిరి లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ కలయిక



కొత్తపేటలో కలుసుకున్న పూర్వ విద్యార్థినులు

కొత్తపేట: స్థానిక చింతం అమ్మణమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాల 1975–76 పదో తరగతి బ్యాచ్ విద్యార్థినులు 50 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. అప్పట్లో కొత్తపేట చదువుల బడి చెట్టు నీడలో కలసి మెలసి చదువుకున్న నాటి బాలికలు తదనంతరం ఉపాధి, వివాహరీత్యా తెలుగు, ఇతర రాష్ట్రాల్లో స్థిరపడ్డారు. వారిలో కొందరికి ఆ నాటి విద్యార్థినులంతా కలుసుకోవాలని ఆలోచన తట్టింది. కొత్తపేటకు చెందిన బందారు వీరలక్ష్మి, హైదరాబాద్‌లో స్థిరపడిన గంటి వెంకటలక్ష్మి తదితరులు కోనసీమ పేరుతో గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. వారు కలుసుకోవడానికి బందారు వీరలక్ష్మి నివాసాన్ని వేదికగా నిర్ణయించారు. ఆ మేరకు శుక్రవారం ఉదయం సుమారు 25 మంది కొత్తపేట చేరుకున్నారు. వారంతా ఒకరికొకరు పరస్పరం ఆలింగనం చేసుకుని కుశల ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ కలయికకు గుర్తుగా బహుమతులు పంచుకున్నారు. భవిష్యత్‌లో తరచూ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో బూసి జయలక్ష్మి (కొత్తపేట సర్పంచ్), కీర్తి సూర్యకుమారి, వించా కన్యాకుమారి, పలివెల మాణిక్యాంబ, విశాఖపట్నం కు చెందిన బండారు సత్యవతి, అమలాపురానికి చెందిన అజ్జరపు శ్రీవల్లి, రాజమహేంద్రవరం నుంచి తోట కుమారి, హైదరాబాద్ నుంచి మేకా భారతి తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు వేగవంతం చేయండి



వంతెన పనులు పరిశీలించి డీఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెం-జి.పల్లిపాలెం మధ్య శంకరగుప్తం మేజర్ డ్రైన్‌పై నిర్మాణంలో ఉన్న వంతెన అప్రోచ్ పనులు వేగవంతం చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. శనివారం ఆయన వంతెన అప్రోచ్ పనులను పరిశీలించారు. రూ.4.30 కోట్లతో గత టీడీపీ హయాంలో ప్రారంభమైన ఈ వంతెన అప్రోచ్ పనులు పూర్తి కాకపోవడంతో నేటికీ వినియోగంలోకి రాలేదు. దీంతో గత డిసెంబర్ నాటికే పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే దేవ అప్పట్లో అధికారులకు సూచించారు. అయినా జాప్యం జరగడంతో తాజాగా పనులు పరిశీలించి అధికారులతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, రాజోలు డీసీ పినిశెట్టి బుజ్జి, డీఈ రాయుడు నాగార్జునరావు, గ్రామ నాయకులు అడబాల సాయిబాబు, సర్పంచ్ గుర్లింక సత్తిబాబు, దిరిశాల బాలాజీ, రావూరి నాగు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంకీర్తన నాట్యాంజలి



బాలాజీ ఆలయ ప్రాంగణంలో ప్రదర్శిస్తున్న సంకీర్తన నాట్యాంజలి

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శనివారం ప్రదర్శించిన అన్నమయ్య సంకీర్తన నాట్యాంజలి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అన్నమాచార్య కీర్తనలకు అనుగుణంగా యువతులు తమదైన శైలిలో నాట్యం చేసి భక్తులను మంత్ర ముగ్ధుల్ని చేశారు. నాట్యగురు రేణుక ప్రభాకర్, లలిత శిష్య బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నులపండువలా జరిగింది. అన్నమయ్య సంకీర్తనా వారసత్వ వైభవాన్ని చాటి చెప్పేలా రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో అన్నమయ్య సంకీర్తనా నాట్యాంజలి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఈ బృందం సభ్యులను ఘనంగా సత్కరించారు.

ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించాలంటూ నిరసన



నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

రావులపాలెం: సకాలంలో ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించిన బకాయిలను చెల్లించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో భాగంగా శనివారం రావులపాలెంలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రి వైద్య సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రగతి నర్సింగ్ హోం డాక్టర్లు కె.బలరామ్‌రెడ్డి, కర్రి సందీప్ రెడ్డి, కర్రి అనంతలక్ష్మి, ఇతర వైద్య సిబ్బంది నల్లరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

బీచ్‌లో పేకాటపై పోలీసుల దాడి

మలికిపురం: మండలంలోని శంకరగుప్తం బీచ్‌లో శనివారం జరుగుతున్న పేకాట శిబిరంపై మలికిపురం ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు దాడి చేశారు. పది మందిని అదుపులోకి తీసుకుని సుమారు రూ.74 వేలను సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిటకిటలాడిన వేంకటేశ్వర ఆలయాలు



జొన్నాడలో ఉభయ దేవేరులతో వేంకటేశ్వరస్వామి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దీంతో మండలంలోని చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలు నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసీ పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

చలివేంద్రం ప్రారంభం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దర్శనానికి వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. స్వామి వారి సన్నిధిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో బుల్లితెర నటి వర్ష

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామిని బుల్లితెర నటి, జబర్‌దస్త్ ఆర్టిస్ట్ వర్ష శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావు, ఆలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆమె స్వామివారికి విశేష పూజలు చేశారు.

వేసవి కాలం.. ఇళ్ల వద్ద జాగ్రత్త

అంబాజీపేట: వేసవి కాలం రావడం... పిల్లలకు, విద్యార్థులకు పాఠశాలలు సెలవులు ఇవ్వడంతో ఊర్లు వెళ్లే వారు వారి ఇళ్ల వద్ద తగు జాగ్రత్తలు తీసుకుని వెళ్లాలని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు చెప్పారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఎండలు మండుతున్నాయని, రాత్రి సమయంలో ఇళ్ల వద్ద తలుపు తెరచి ఉంచి నిద్రపోకూడదన్నారు. అలాగే డాబాలపైన, ఆరుబయట పడుకునే వారు ఇంటికి తాళాలు వేసుకోవాలన్నారు. సెలవులకు, శుభకార్యాలకు దూర ప్రాంతాలు వెళ్లే వారు తగు భద్రతను ఏర్పాటు చేసుకోవాలని, చుట్టుపక్కల వారికి చెప్పి వెళ్లాలన్నారు. బంగారు ఆభరణలు, నగదు ఉంటే దగ్గరలో ఉన్న బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. రాత్రి సమయంలో గస్తీని ఏర్పాటు చేశామన్నారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఉన్నాయన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అన్నదానం ట్రస్టుకు విరాళం



దాత దంపతులకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు మామిడికుదురుకు చెందిన గోకవరపు శ్రీరాములు, అనంతలక్ష్మి దంపతులు శనివారం రూ.25,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందజేశారు. దాత దంపతులను ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు అభినందించారు. విరాళం అందించిన దాతకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. వారికి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.